




సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శనివారం 23-11-2024

సంపుటి: 20 సంచిక: 204

పేజీలు: 4 వెల: రూ.1


# ఎంత తవ్వారు.. ఎంత సంపాదించారు?





నివగాంలో తవ్వకాలు జరుపుతున్న దృశ్యం..

- ‘అసలు జిల్లాలో ఎన్నిచోట్ల ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి? దాని ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఎంత చేరింది?’ ఇది మైన్స్ అధికారులకు కలెక్టర్ అడిగిన ప్రశ్న. ఎంత తవ్వకాలు జరిగిందో లెక్క లేదు. ‘ఎంతమంది డీడీలు తీస్తున్నారో తెలీదు. ఉచితం కావడంతో అగ్రెసివ్‌గా ముందుకెళ్లలేకపోతున్నాం.’ ఇది మైన్స్ డీడీ కలెక్టర్‌కు చెప్పిన సమాధానం. దీంతో ఏడు రోజులకు అనుమతులు ఇచ్చిన ర్యాంపుల్లో తవ్వకాలు ఆపాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశాలిచ్చిన వైనమిది.
- జిల్లాలో ప్రభుత్వం అనుమతి ఇచ్చిన డీషిల్టేషన్ కాలువల్లో తప్ప మిగిలిన చోట్ల ఇసుక తవ్వకాలు ఆపాలని స్వయంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశించినా ఎక్కడా దాన్ని పాటించే నాధుడు కనిపించడంలేదు. కలెక్టర్ ఆఫీసులో ఉండే అధికారి ఇక్కడికి వచ్చి ఏం చూస్తారన్న ధీమాలో ఇసుకాసురులు ఉంటే, దారి పొడవునా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసినచోట కనీస తనిఖీలు లేకపోవడంతో ఇసుకను పక్కజిల్లాకు పట్టుకుపోతున్నారు. వివరాల్లోకి వెళితే..



నివగాంలో తవ్వకాలు జరుపుతున్న దృశ్యం..

- మైన్స్ అధికారుల నుంచి కలెక్టర్ ఆరా
- లెక్కలు చెప్పలేక చేతులెత్తేసిన మైన్స్
- తాత్కాలిక అగ్రిమెంట్లు రద్దు
- సీసీల ఏర్పాటుకు ఆదేశం
- ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇసుక కొరతను నివారించి నిర్మాణ రంగానికి ఊతమివ్వాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తీసుకువచ్చింది. అందులో భాగంగా ఇసుకను తవ్వి ఒడ్డున వేయడానికి టెండర్లు పిలిచింది. ఇందుకు హాజరైన కాంట్రాక్టర్లు వేసిన బిడ్లు, చూపిన పత్రాలు నమ్మశక్యంగా లేవనే కారణంతో వారం రోజులకు తాత్కాలిక అనుమతులు 12 ర్యాంపులకు మంజూరు చేసింది. ఇందులో మొదటి విడతగా ఆరు ర్యాంపులు జిల్లాలో మొదలయ్యాయి. ఆ తర్వాత మరో ఆరు ర్యాంపులు వచ్చాయి. అయితే ప్రభుత్వం ఇచ్చిన గడువు ఏడు రోజులు ముగిసిపోవడంతో ఈ ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు నిలిపేయాలని ప్రభుత్వం కొత్త నిర్దేశకాలిస్తే తవ్వకాలు ప్రారంభించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కానీ ఇసుక తవ్వకాలు మాత్రం ఆగడంలేదు. జిల్లాలో అనేక ర్యాంపుల నుంచి ఇసుక అక్రమంగా తవ్వేస్తున్నారన్న నివేదికల మేరకు మైనింగ్ డీడీని పిలిచి అసలు ఇప్పటి వరకు ఏయే ర్యాంపుల్లో ఎన్ని మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వారో చెప్పాలని కలెక్టర్ కోరారు. కానీ, ప్రతీ ర్యాంపులోను ప్రొక్లయినర్లు దించి పెద్ద ఎత్తున ఇసుకను తవ్వుకుపోవడంతో మైనింగ్ శాఖ ఎక్కడ ఎంత తవ్వారనే నిఘాను ఉంచలేదు. ఎందుకంటే.. ఒకవైపు స్వయంగా ముఖ్యమంత్రే ఉచితఇసుకని ట్రాక్టర్ మీద లోడు ఎక్కువ ఉన్నా కేసు రాస్తే ఒప్పుకోనని ప్రకటించడంతో మైనింగ్ శాఖ అటువైపు దృష్టి సారించలేదు. మరోవైపు నదీ గర్భాలు ఎక్కడికక్కడ దొలిచేస్తున్నారన్న కథనాల మేరకు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఎవరైనా ఆశ్రయిస్తే స్వయంగా కలెక్టరే సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది కాబట్టి ఎంతమేరకు తవ్వారన్న నివేదికను అడిగారు. అది మైన్స్ శాఖ వద్ద లేకపోవడంతో వారం రోజుల పాటు ఇచ్చిన అనుమతులు రద్దయ్యాయని కలెక్టర్ ప్రకటించారు. త్వరలోనే అన్ని ర్యాంపుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి, లారీలను జియోట్యాంగింగ్ చేసి పర్యవేక్షించాలని మైన్స్ శాఖను ఆదేశించారు. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా తవ్వకాలు జరుపుతున్నవారికి మైన్స్ డీడీ సమాచారమందించారు. వీరంతా విననట్టే నటించి తమ పని తాము చేసుకుపోతున్నారు. ప్రస్తుతానికి ఉత్తరాంధ్రలో ఇసుక కొరత లేదు. అవసరానికి మించే తవ్వేశారు. కానీ ఎక్కడికక్కడ స్టాక్ పాయింట్లు పెట్టుకొని ఇసుకను నిల్వ చేస్తున్నారు. ఎవర్ని అడిగినా సొంత అవసరాల కోసం సొంతంగా తవ్వించుకుంటున్నామనే సమాధానాలిస్తున్నారు. మరోవైపు నదుల్లో ప్రొక్లయినర్లు ఉన్నా మైన్స్, రెవెన్యూ శాఖలు ఏమీ చేయలేకపోతున్నాయి. ఎందుకంటే.. టెండర్లను కాదని నామినేషన్ పద్ధతిలో ఇసుక తవ్వకాలకు అనుమతి తెచ్చుకున్నారంటే కచ్చితంగా ప్రభుత్వ పెద్దల అండదండలు ఉంటాయని సంబంధిత శాఖలు భావిస్తున్నాయి. ఎంత ఉచిత ఇసుకైనా ఎంత తవ్వుతున్నారన్నదానికి ఒక లెక్కుండాలి. అది లేకపోవడంతో ఇసుకాసురుల ఇష్టారాజ్యంగా మారింది. వాస్తవానికి గార, కాఖండ్యాంలలో డీషిల్టేషన్ కింద ఇసుకను తవ్వకోడానికి పూర్తిస్థాయి అనుమతులున్నాయి. ప్రస్తుతం 12 ర్యాంపులూ మూతపడినట్టే. ఈ రెండు చోట్లా కాకుండా ఎక్కడ ఇసుక తవ్వినా, రవాణా చేసినా చర్యలు తీసుకునే అధికారం యంత్రాంగానికి ఉంది. ఇప్పుడు నివగాం, బట్టేరు, పురుషోత్తపురం, ముద్దాడపేట, గోపాలపెంటలో ఇప్పటికీ తవ్వకాలు జరుగుతున్నాయి.

### బిల్లులతో పొంతన కుదరడంలేదు

సాధారణంగా ఇసుక కావాలంటే గ్రామ సచివాలయాలు లేదా ఏపీ శాండ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలి. జీపీఎస్ అమర్చిన వాహనంతో పాటు ఏ రీచ్ నుంచి కావాలో ఎంపిక చేసుకోవాలి. అధికారుల నుంచి అనుమతి పత్రం వచ్చాక రీచ్‌కు వెళ్లి చూపిస్తే కాంట్రాక్టర్ లోడ్ చేస్తారు. అయితే ఈ విధంగా ఎంతమంది బిల్లులు తెచ్చారు? ఎంత ఇసుక లోడయిందన్న లెక్కలు కూడా సంబంధిత శాఖలో లేవు. తాత్కాలిక అగ్రిమెంట్లు ఇచ్చినప్పుడు ఇసుక లభ్యతను బట్టి 7వేల మెట్రిక్ టన్నుల నుంచి 10వేల మెట్రిక్ టన్నుల వరకు ఒక్కో రీచ్‌కు కేటాయించారు. ఇంత ఇసుక తరలిపోయిన తర్వాత కనీసం సంబంధిత ర్యాంపులో ఆ మేరకు వ్యాపారమైనా జరిగినట్లు డబ్బులు ప్రభుత్వ ఖాతాలో జమవ్వాలి. కానీ అటువంటిదేమీ లేకుండానే వందలాది లారీలు వెళ్లిపోవడంతో కలెక్టర్ మొత్తం ర్యాంపులను ఆపేయాలన్న నిర్ణయం తీసుకున్నారు.

## ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలి

- కళింగపట్నం, పెదగనగళ్ల బీచ్‌ల అభివృద్ధి
- విలీన పంచాయతీలకు ఎన్ఆర్ఈజీఎస్ పనులు కేటాయించాలి
- అసెంబ్లీలో సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే శంకర్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నియోజకవర్గానికి సాగునీటి కొరత అధికంగా ఉందని, త్వరతిగతిన ఎత్తిపోతల పథకాలను పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. శ్రీకాకుళం నియోజకవర్గ సమస్యలను ఆయన అసెంబ్లీలో ప్రస్తావించి సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై శనివారం తన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం నియోజకవర్గం టైలెండ్ నియోజకవర్గం సముద్ర తీరానికి దగ్గర ఉందని, సాగునీటి సమస్యలు జిల్లాలో చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. 2014-19 మధ్య కాలంలో కళింగపట్నం, వమరవల్లి, తోణంగి, గార ప్రాంతాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ఇచ్చి 85 శాతం పనులు పూర్తి చేశామని, చెక్కబాక్సుల్లో మోటార్లు తెచ్చి ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇవి గత ఐదేళ్లలో తుప్పుపట్టిపోయాయని తెలిపారు. త్వరితగతిన ఈ పనులు పూర్తిచేస్తే 2,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవకాశం కలుగుతుందని వివరించారు. అలాగే అంబల్లవలస ఎత్తిపోతల పథకం కోసం వేసిన శిలాఫలకం అలాగే ఉందని, పనులు పూర్తి కాలేదని తెలిపారు. వత్సవలస ఎత్తిపోతల పథకం కూడా కావాలని కోరారు. 37 టైలెండ్‌లో ఆర్ఎంసీ రైట్ మెయిన్ కెనాల్ పనులు 2007 నుంచి ప్రారంభించలేదని, వీటి పనులు పూర్తి చేస్తే 3,500 ఎకరాలకు సాగునీరంది రైతుల ఇబ్బందులు తీరుతాయని, రైట్ మెయిన్ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. శ్రీకాకుళం జల్లాకు వంశధార, నాగావళి నదులు ప్రధానమైనవని, వంశధాన నది గార మండలం కళింగపట్నం వద్ద, నాగావళి నది శ్రీకాకుళం రూరల్ మండలం పెదగనగళ్ల వానిపేట వద్ద సముద్ర తీరంలో కలుస్తుందన్నారు. గతంలో కళింగపట్నం బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్ది బీచ్ ఫెస్టివల్ కూడా నిర్వహించినట్టు వివరించారు. ఇటీవల వచ్చిన తుఫాన్ల కారణంగా ఈ బీచ్‌లు కోతకు గురయ్యాయని, దీంతో సమీప మత్స్యకార గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. తీరం కోతకు గురైతే మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయి ప్రాణ, ఆస్తినష్టం కలుగుతుందని చెప్పారు. ఇటీవల శ్రీకాకుళం సమీపంలో ఉన్న విలీన గ్రామ పంచాయతీల ఉపాధి హామీ పనుల నిధులు మంజూరుచేయాలని కోరారు. పీఆర్ ఈఈ డివిజన్ పంచాయతీరాజ్ శాఖ పరిధిలోనిదని, దానిని గత ప్రభుత్వం అన్నమయ్య జిల్లా రాయచోటికి తరలించిందని, వాటిని కూడా అందించాలని కోరారు. పెద్దఎత్తున ఎన్ఆర్ఈజీఎస్ పనులు అందించి ఆదుకోవాలని సంబంధిత మంత్రిని ఎమ్మెల్యే గొండు శంకర్ అసెంబ్లీలో కోరారు.

## ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం

### - తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు స్వాతిశంకర్ -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని ప్రధాన పైపులైను పాడైపోవడంతో తాగునీటికి నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసున్న ఎమ్మెల్యే గొండు శంకర్ గెడ్డపై నుంచి కొత్త పైపులైన్ ఏర్పాటుచేసి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా సమస్యను పరిష్కరించారు. ఈ పైపులైను పనులను తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గొండు స్వాతి శంకర్ శనివారం పరిశీలించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ఎప్పుడూ ముందుంటారని తెలిపారు. నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులను లేకుండా చేసి పూర్తిస్థాయిలో సహకరిస్తామని తెలిపారు. ఈమె వెంట టీఎన్ఎస్ఎఫ్ నియోజవర్గ అధ్యక్షులు రెడ్డి గిరిజాశంకర్, పాత్రునివలస మాజీ సర్పంచ్ పంచిరెడ్డి అప్పలనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోలీసుల అదుపులో గూనపాలెం యువకుడు

- 2.1 కేజీల గంజాయి స్వాధీనం
- డ్రోన్‌తో క్రైం స్పాట్‌లు గుర్తింపు
- మత్తు ఆనవాళ్ల కోసం స్నిప్పర్ డాగ్స్
- డీఎస్పీ సీహెచ్ వివేకానంద



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శుక్రవారం సాయంత్రం నగరంలోని 80 అడుగుల రోడ్డులో అనుమానాస్పద కదలికలపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు గూనపాలెం, చెరువుగట్టు వీధికి చెందిన యువకుడు లండ కుమార్‌ను ఒకటో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ సిహెచ్ వివేకానంద తెలిపారు. శనివారం వన్‌టౌన్ సర్కిల్‌పరిధి సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఎం.హరికృష్ణతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నిందుతుడి నుంచి 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసకున్నట్టు తెలిపారు. చెడు అలవాట్లకు బానిసై డబ్బులు సంపాదించాలన్న యావతో నిందితుడు కుమార్ ఒడిశాలోని పర్లాకిమిడి నుంచి గంజాయిని తీసుకువచ్చి నగరంలో విక్రయిస్తున్నట్టు తెలిపారు. గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా తయారుచేసి నగరంలో యువకులకు విక్రయిస్తున్నాడని తెలిపారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు మరికొందరిని అదుపులోకి తీసుకోనున్నట్టు తెలిపారు. గంజాయిని కొనుగోలు చేసి సేవిస్తున్న కొందరు యువకులను నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు గుర్తించి వారి తల్లిదండ్రుల ద్వారా డీఎడిక్షన్ కేంద్రానికి తరలిస్తామన్నారు. జిల్లాలో గంజాయిని నియంత్రించడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నేరాలను అదుపు చేయడానికి, గంజాయి, మత్తు పదార్థాలను సేవించేవారిని గుర్తించడానికి నగరంలో డ్రోన్స్ ఎగురవేస్తున్నట్టు తెలిపారు. డ్రోన్స్ ద్వారా నేరం జరిగే అవకాశం ఉన్న లొకేషన్లను గుర్తిస్తున్నట్టు తెలిపారు. దీనికోసం ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నట్టు వివరించారు. గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించడానికి స్నిప్పర్ డాగ్స్‌ను రోజూ డివిజన్ పరిధిలో ఏదో ఒక ప్రాంతంలో తిప్పుతున్నట్టు తెలిపారు. ముఖ్యంగా రైల్వే, బస్ స్టేషన్లలో స్నిప్పర్ డాగ్స్ ద్వారా గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించేందుకు వినియోగిస్తున్నట్టు తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల్లో గంజాయి, మత్తుపదార్థాలు సేవించే ఆనవాళ్లను డాగ్స్ ద్వారా గుర్తించినట్టు తెలిపారు. వీటిని క్రైం స్పాట్‌లు గుర్తించి డ్రోన్స్ ద్వారా నిఘా పెట్టామన్నారు. గంజాయిని నియంత్రించడానికి జిల్లాలో పోలీస్‌శాఖ పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటి వరకు 41 కేసులు నమోదుచేసి 100మందిని జైల్లో పెట్టామన్నారు. గంజాయి నియంత్రించడంలో పోలీసుశాఖ కొంతమేర విజయవంతమైందన్నారు. గంజాయి మూలాలన్నీ ఒడిశాలోనే ఉన్నాయన్నారు. ఒడిశాలో పోలీసుల నుంచి సహకారం అందడంలేదన్నారు. యువత మత్తుకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గంజాయితో యువకుడిని అదుపులో తీసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించారు.

## సీఎం ఆర్ఎఫ్‌కు రూ.25లక్షలు విరాళం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ముఖ్యమంత్రి సహాయనిధికి ఆంధ్రప్రదేశ్ హోటల్ అసోసియేషన్ తరపున రూ.25 లక్షల చెక్కును కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌ల సమక్షంలో సీఎం చంద్రబాబు నాయుడుకు అమరావతిలో అందజేశారు. ఈ కార్యక్రమంలో 13 ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు ఈ సంఘ ప్రధాన కార్యదర్శి మెట్ట నాగరాజు, శ్రీకాకుళం టౌన్ అధ్యక్షుడు ట్రాఫిక్‌జామ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



● ఎడిటోరియల్

# పరమత సహనమా? పరమత ద్వేషమా?

జనసేన నేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇటీవల మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ సనాతన ధర్మం జోలికొస్తే ఊరుకోబోనంటూ హెచ్చరికలు జారీ చేశారు. అన్ని మతాలను సమానంగా చూసేదే సనాతన ధర్మం అంటూ ఒకవైపు చెబుతూనే మరోవైపు చర్చి, మసీదులపై విషం కక్కారు. గత కొంతకాలంగా పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం పేరుతో చాలా అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇతర మతాల పట్ల అసహనమే సనాతన ధర్మం అయితే అది రాజ్యాంగ విరుద్ధం. లౌకికతత్వాన్ని పరిరక్షిస్తానని రాజ్యాంగం మీద ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆ రాజ్యాంగాన్నే సవాలు చేస్తున్నారు. ఇంత వరకు ఆయన నిర్దిష్టంగా సనాతన ధర్మం అంటే ఇదీ అని చెప్పలేదు. పైగా సనాతన ధర్మ పరిరక్షణ కోసం జనసేన తరపున 'నరసింహ వారాహి దళా'న్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ దళాలు ఏం చేస్తాయో కూడా స్పష్టం చేయలేదు. సనాతన ధర్మం అంటే పరమత సహనమా? పరమత ద్వేషమా? సహనమే ఆయన భావం అయితే అంతగా అసహనం వ్యక్తం చేయాల్సిన అవసరం లేదు. భారతదేశ చరిత్రలో పరమత సహనం, అసహనం రెండూ ఘర్షణ పడుతూనే వస్తున్నాయి. బ్రిటిష్ వ్యతిరేక స్వాతంత్ర్య పోరాటంలో మత సామరస్యం రూపుదిద్దుకుంది. 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో హిందువులు, ముస్లింలు, సిక్కులు కలిసి బ్రిటిష్ పాలకులను ఎదుర్కొని ప్రాణాలర్పించారు. ఝాన్సీ లక్ష్మీబాయి, తాంతియా తోపే, బహదూర్ షా, మంగళ్ పాండే, బేగం హజరత్ మహల్, కున్వర్‌సింగ్ లాంటి అనేకమంది ఈ పోరాటంలో అసువులు బాసినవారే. 1905 బెంగాల్ విభజన సమయంలో హిందూ ముస్లింలు ఐక్యమై బ్రిటిష్ కుట్రలను ఓడించి ఐక్య బెంగాల్‌ను కాపాడుకున్నారు. బ్రిటిష్ పాలకులు మత ఘర్షణలు పెట్టి స్వాతంత్ర్యోద్యమాన్ని దెబ్బ తీయాలని చూశారు. మొన్నటి దాకా చేగువేరా బొమ్మ పెట్టుకొని యువతను ఆకర్షించి ఇప్పుడు ఆ చేగువేరా బొమ్మను పక్కన పడేసి మోడీ బొమ్మ తగిలించుకొని హఠాత్తుగా అవతారం మార్చేశారు. ఆర్‌ఎస్ఎస్, బిజెపిలు చేయలేని పనిని రాష్ట్రంలో పవన్ కళ్యాణ్ ద్వారా చేయిస్తున్నారు. ఎన్డీయే కూటమిలో ప్రధాన భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్నది. తెలుగుదేశం పార్టీకి చెక్ పెట్టి తమ ఆధిపత్యాన్ని సాధించడానికి బిజెపి పవన్ కళ్యాణ్‌ను ముందు పెట్టి బీ టీమ్‌గా మార్చుకుంటున్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగటాన్ని ఖండిస్తూ మహారాష్ట్ర ఎన్నికల సభలో గళమెత్తారు. కానీ మణిపూర్ మండిపోతున్న విషయాన్ని మాత్రం విస్మరించారు. మతోన్మాదం ఏ పేరుతో ఉన్నా ప్రమాదమే బంగ్లాదేశ్‌లో మతోన్మాదానికి హిందువులే కాదు ముస్లింలు కూడా బలవుతున్నారు. బీజేపీ, ఆర్‌ఎస్ఎస్‌లను వెనకేసుకొస్తూ అన్ని మతాలను ఆయన ఎలా సమానంగా గౌరవించగలరు? గత కొద్దిరోజులుగా మణిపూర్ తిరిగి భగ్గుమంటున్నది. రెండు ఆదివాసీ తెగల మధ్య మతం పేరుతో కుంపటి రాజుకుంది. అది ఇప్పుడు పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు అనే తేడా లేకుండా మనుషులందరినీ బలిగొంటోంది. ఏడాదిన్నరగా మణిపూర్‌లో మానవత్వం మంట గలుస్తున్నా మోడీ నోరు మెదపడం లేదు. కనీసం ఆ రాష్ట్ర ప్రజలను ఓదార్చడానికి సందర్శించనూ లేదు. ఇదేనా పవన్ కళ్యాణ్ దృష్టిలో మానవత్వమంటే? మణిపూర్ కోసం మోడీని నిలదీయగలరా? సనాతన ధర్మం పేరుతో ఇలాంటి మారణకాండను, అకృత్యాలను పవన్ కళ్యాణ్ ఎలా సమర్థించగలరు? మూడోసారి బీజేపీ కేంద్రంలో అధికారంలోకి రావడమే గాకుండా ఆంధ్రప్రదేశ్‌ను హస్తగతం చేసుకోవాలని నానారకాల వ్యూహాలు పన్నుతున్నది. అందులో పవన్ కళ్యాణ్ ఒక పావు మాత్రమే. మరోవైపు తిరుమల తిరుపతి దేవస్థానాన్ని తమ గుప్పెట్లోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పావులు కదుపుతున్నది. టీటీడీ లడ్డు వివాదం సందర్భంలో సంబంధం లేకపోయినా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు నేరుగా రిపోర్టులు తెప్పించుకోవడం ఇందులో భాగమే. తిరుమలపై రాజకీయ ప్రకటనలు అనుమతించబోమని చెప్పిన బోర్డు అదే రాజకీయ నాయకుల చేతిలో కీలుబొమ్మ కాకూడదు. అయోధ్యలో అడ్రస్ లేకుండా పోయిన బిజెపి టిటిడిని ఎలాగైనా తన కబంధ హస్తాల్లో బంధించాలని రంగంలోకి దిగింది. వారి చేతిలో టిటిడి బోర్డు తురుపు ముక్క కాకూడదు.



వైవిధ్యమైన భారతావనిలో భిన్న కులాలు, మతాలు, ఆచారాలు, సంస్కృతులు, సాంప్రదాయాలు, నాస్తికులు, ఆస్తికులు, హేతువాదులెలానైతే కనిపిస్తారో ఆ రీతిలో ఇతర దేశాల్లో మనకు ఆ భిన్నత్వం సాధారణంగా కనిపించకపోవచ్చు. పైగా మన దేశంలో పెరిగిన ప్రాశ్చాత్య ధోరణులతో పోలిస్తే మన సంప్రదాయాలను ఆచరించే సమాజాలు వేళ్లమీదే కనిపిస్తాయి. కానీ, అక్కడో ఇక్కడో మన మూలాలనూ ఆచరించేవారూ, గొప్పగా చూసేవారు, అంతకంతకూ ప్రచారం కల్పించే వారూ ఉంటారు. అదిగో అలాంటి ఓ వ్యక్తి గురించే మనం చెప్పుకుంటున్నాం. అందుకు మనమోసారి బ్రెజిల్ వెళ్లొద్దాం.

# గీతా ప్రచారంలో హద్దులు చెరిపారు!

జోనాస్ మాసెట్టి.. ఇప్పుడు వార్తల్లో వ్యక్తి. ఎందుకంటే, ప్రధాని మోడీ జోనాస్ మాసెట్టి ఉరఫ్ విశ్వనాథన్‌ను బ్రెజిల్ లో కలిశారు. జీ20 శిఖరాగ్ర సదస్సు తర్వాత నేరుగా మాసెట్టిని కలిసిన మోడీ సంస్కృతంలో మాసెట్టి రామాయణాన్నీ కనులారా వీక్షిస్తూ కాస్సేపు విన్నారు. ఈ సందర్భంగా తాను గతంలో మన్ కీ బాత్ ప్రోగ్రాంలో జోనాస్ మాసెట్టి గురించి ప్రస్తావించినట్టు పేర్కొంటూ.. మళ్లీ ఎక్స్‌లో కొన్ని మాసెట్టిని తాజాగా కల్సిన ఫోటోలతో పోస్ట్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి వ్యాప్తి చెందుతుండటంపై పీఎం మోడీ ఆనందాన్ని వ్యక్తం చేశాడు. అందు కే, ఇప్పుడు మళ్లీ జోనాస్ మాసెట్టి పేరు పతాకశీర్షికలకెక్కింది.

## జోనాస్ మాసెట్టి ఎవరసలు..?

జోనాస్ మాసెట్టి ఓ మెకానికల్ ఇంజనీర్. కొంతకాలం ఉద్యోగం చేసిన మాసెట్టి.. భారతీయ సంస్కృతికి ఆకర్షించబడ్డాడు. ముఖ్యంగా ఇక్కడి హైందవ గ్రంథాలు అతడిపై అమిత మైన ప్రభావాన్ని చూపాయి. అందులోని వేదాంతం వైపు అడు గులు పడ్డాయి. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన జోనాస్ కొంతకాలం స్టాక్‌మార్కెట్‌కు సంబంధించిన ఓ కంపెనీలో పనిచేశాడు. తనే ఓ కన్సల్టెన్సీనీ నడపాడు. అలాగే, కొన్ని టాప్ మేనేజ్‌మెంట్ కంపెనీలతోనూ పనిచేశాడు. ఆ సమయంలోనే అన్నీ ఉన్నా ఏదో అసంతృప్తి తనను వెంటాడేదని.. అందుకే, ఆ సంతృప్తి భారతీయ ఆధ్యాత్మిక జీవన విధానంలో ఉందని నమ్మాడు. అలా భారతీయ ఆధ్యాత్మికత వైపు అతడి అడుగులు మరింత బలంగా పడటానికి కోయంబత్తూరులోని ఆర్ష విద్యా గురుకులంలో శిక్షణ మరింత ఊతమైంది. ఆ తర్వాత జోనాస్ మాసెట్టి కాస్త విశ్వనాథ్‌గా తన పేరు కూడా మార్చుకున్నాడు. ఇప్పుడే కంగా తను విశ్వవిద్య పేరిట బ్రెజిల్ రాజధాని నుంచి గంట ప్రయాణం చేస్తే చేరుకునే పెట్రోపోలిస్ కొండల్లో ఓ ఇనిస్టిట్యూషనే నడుపుతున్నాడు.

గత ఏడేళ్లలో 1 లక్షా 50 వేల మందికి పైగా విద్యార్థులకు తన ఉచిత ఓపెన్ కోర్సును బోధించారని ప్రధాని మోడీ కూడా తన ప్రసంగంలో పేర్కొన్నాడు. తన గయానా పర్యటనకు ముం దు మోడీ జోనాస్‌ను కలిశారు.

## మాసెట్టికి ఎందుకంత ప్రజాదరణ.. ?

రియో సమీపంలోని తన విశ్వ విద్య ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు బోధించడమే కాకుండా.. మాసెట్టి తన రోజువారీ పోడ్‌కాస్ట్‌తో.. వేదాంత క్యాస్ట్ ద్వారా ఆన్‌లైన్‌లో వేలాదిమందికి, అలాగే యూట్యూబ్ ద్వారానూ తన బోధనలను వినిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆధ్యాత్మిక, యోగా, వేదాలకు సంబంధించిన వీడియోస్ జోనాస్ యూట్యూబ్‌లో కనిపిస్తాయి. ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్స్‌లో కూడా పెద్ద ఎత్తున ఫాలోవర్స్ కల్గి ఉన్న జోనాస్.. భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాల సారాన్ని విశ్వవ్యాప్తం చేయాలన్న సంకల్పంతో తన బ్రెజిల్‌లో ఏకంగా ఓ విద్యాలయాన్నే ఏర్పాటు చేయడంతో పాటు భగవద్గీతకు విశేష ప్రాచుర్యం కల్పిస్తున్నాడు. మొత్తంగా ప్రధాని మన్ కీ బాత్ లో ప్రస్తావించిన తర్వాత ఎవరీ జోనాస్ మాసెట్టి అని కొంత క్యూరియాసిటీ కల్గించిన విశ్వనాథ్.. ఇప్పుడు మళ్లీ బ్రెజిల్ లో మోడీతో కలిశాక వార్తల్లో మరింత ముందుకొచ్చాడు. **- బాతాఖానీ.కామ్ సౌజన్యంతో**







# రొటీన్ కథకు ట్విస్టులతో రిపేర్లు!

యువ కథా నాయకుడు.. విశ్వక్సేన్. ఈ ఏడాది ఇప్పటికే గామి.. గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి చిత్రాలతో పలకరించిన అతను.. ఇప్పుడు 'మెకానిక్ రాకీ'తో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. రవితేజ ముళ్ళపూడి అనే కొత్త దర్శకుడు రూపొందించిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:**

రాకేష్ అలియాస్ రాకీ (విశ్వక్సేన్) చదువు సరిగా అబ్బక తన తాత.. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన కారు గ్యారేజీ బాధ్యతలు చూసుకుంటూ ఉంటాడు. ఐతే ఆ గ్యారేజ్ ఉన్న స్థలం మీద రంకిరెడ్డి (సునీల్) అనే గూండా కన్ను పడుతుంది. తన మనుషులను పంపించి గ్యారేజ్ ఖాళీ చేయించాలని చూస్తాడు కానీ.. రాకీ అడ్డు పడతాడు. అయినా రంకి రెడ్డి ప్రయ త్నాలు ఆగవు. ఈలోపు రాకీ తండ్రి చనిపోతాడు. తండ్రి కోరిక మేరకు ఎలాగైనా గ్యారేజ్ కాపాడుకోవాలని రాకీ విశ్వ ప్రయ త్నం చేస్తాడు. మరి తన ప్రయత్నం ఫలించిందా.. రంకిరెడ్డితో అతడి పోరాటం ఎక్కడి దాకా వెళ్లింది.. ఈ ప్రశ్నలకు సమాధానం తెర మీదే తెలుసుకోవాలి.

**నటీనటులు:** ఎలాంటి కథలో అయినా ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్‌తో తన వరకు ఎంగేజ్ చేస్తాడని విశ్వక్ పేరు తెచ్చుకున్నాడు. 'మెకానిక్ రాకీ'లో కూడా అదే చేశాడు. చాలా రొటీన్ గా సాగిపోయే ప్రథమార్థంలో కూడా విశ్వక్ పెర్ఫామెన్స్ ప్రేక్షకులను కొంత ఎంగేజ్ చేస్తుంది. ఇక కథ పరంగా బలం.. వైవిధ్యం ఉన్న ద్వితీయార్థంలో అతను మరింత మెప్పించాడు. మోసపోతున్న వాడిలా అమాయకంగా కనిపించినపుడు.. ఇదంతా డ్రామా అని తెలియజేస్తూ తన పాత్రలో మరో కోణంలో చూపించేటపుడు తనలోని పెర్ఫామర్ కనిపిస్తాడు. హీరోయిన్లు ఇద్దరికీ సినిమాలో మంచి పాత్రలు పడ్డాయి. మధ్య తరగతి అమ్మాయిగా 'లక్కీ భాస్కర్' తర్వాత మీనాక్షి చౌదరి మరోసారి మెప్పించింది. ట్రెడిషనల్ లుక్స్ లోనే తన అందంతో ఆకట్టుకున్న మీనాక్షి.. కథలో కీలకమైన సన్నివేశాల్లో చక్కగా నటించింది. శ్రద్ధా శ్రీనాథ్ పాత్ర.. తన నటన ఆశ్చర్యపరుస్తాయి. తన పాత్రలో విశేషం ఏంటన్నది తెర మీదే చూడాలి. రంకిరెడ్డిగా విలన్ పాత్రలో సునీల్ రొటీన్ అనిపిస్తాడు. హర్ష చెబుడు హీరో ఫ్రెండు పాత్రలో కొంత నవ్వించాడు. హీరో తండ్రిగా నరేష్ అలవాటైన పాత్రలో ఆకట్టుకున్నాడు. హర్షవర్ధన్.. మిగతా ఆర్టిస్టులు ఓకే.

**కథనం-విశ్లేషణ:**

ప్రథమార్థమంతా ఒక ఫ్లోలో మామూలుగా కథను నడిపించ డం.. ఏదో ఒక చోట ట్విస్ట్ ఇచ్చి.. తూచ్ ఇప్పటిదాకా మీరు చూసిందంతా అబద్ధం.. అసలు కథ ఇది అంటూ ప్రేక్షకులను షాక్ కు గురి చేయడం.. అక్కడ్నుంచి ట్విస్టుల మీద ట్విస్టులిస్తూ ఎంగేజ్ చేయడం.. 'పోకిరి' తర్వాత ఈ ఫార్ములా చాలా కామన్ అయిపోయింది. యువ కథానాయకుడు విశ్వక్సేన్ సైతం ఆల్రెడీ ఇదే ఫార్ము లాతో 'ధమ్కీ' సినిమా చేశాడు. అందులో ధమ్కీలు మరీ ఎక్కువ పోయి తేడా కొట్టేసింది. కానీ అతను మళ్లీ అదే స్టయిల్లో ఇంకో సినిమా చేశాడు. అదే.. మెకానిక్ రాకీ. సగం వరకు చాలా రొటీన్‌గా సాగిపోతూ.. సగటు మసాలా సినిమాలా కనిపించే 'మెకానిక్ రాకీ' రెండో అర్ధంలో కొత్త టర్న్ తీసుకుని ప్రేక్షకులను కొంతమేర ఎంగేజ్ చేస్తుంది. విశ్వక్సేన్ ఎప్పట్లాగే ఎనర్జిటిక్ పెర్ఫామెన్స్‌తో సినిమాను నిలబెట్టడానికి తన వంతు ప్రయ త్నం చేశాడు. ఇద్దరు అందమైన హీరోయిన్లు.. వారి పాత్రల చిత్రణ.. మ్యూజిక్ కొంతమేర ప్లస్ అయి 'మెకానిక్ రాకీ' ఓ మోస్తరు సిని మాలా అనిపిస్తుంది. 'మెకానిక్ రాకీ' ప్రథమా ర్ధం చూశాక.. మొత్తం సినిమా చూడాలన్న ఆశే కలగదు. మధ్యలోనే లేచి వెళ్లిపోదాం అనేం తగా రొటీన్ టెంప్లేట్ వినోదంతో విసుగెత్తి స్తుంది ఫస్టాఫ్. కొత్త దర్శకుడు కాస్తయినా కొత్తదనం లేకుండా చాలా మామూలుగా నడి పించేశాడు ఈ కథను. హీరో ఎంట్రీ దగ్గ ర్నుంచి అన్నీ ఒక టెంప్లేట్ ప్రకారం సాగిపోతుం టాయి. రెండో కథానాయికకు హీరో తన స్టోరీ చెప్పడంతో మొదలయ్యే ఈ కథలో చాలా సేపు ఏ విశేషాలూ కనిపించవు. సీమ ఫ్యాక్ష నిస్టుగా పాత గెటప్పులో విశ్వక్ చేసే హంగామా కొంత నవ్విస్తుంది తప్ప.. వర్తమానంలో మాత్రం అంతా రొటీన్‌గా సాగిపోతుంది. హీరో కాలేజీ వ్యవహారం.. కథానాయికతో ప్రేమ.. చదువు సరిగా సాగక గ్యారేజ్ చేతికి తీసుకోవడం.. ఇలా మామూలుగా నడిచిపోతుంది కథ. విలన్ ఎంట్రీతో అయినా ఏమైనా కథలో ఊపు వస్తుందేమో అనుకుంటే అదీ జర గదు. హీరో స్థలం మీద విలన్ కన్నేయడం.. వాళ్లను అతను గొడవ పడడం.. ఇలా ఈ ట్రాక్ సైతం రొటీనే. మధ్య మధ్యలో రొటీన్ పాటలు.. ఫైట్లతో 'మెకానిక్ రాకీ' చిన్న హై కూడా లేకుండా సాగిపోతుంటుంది. అసలే ముందని ఈ కథను విశ్వక్ ఓకే చేశాడు అనే సందేహాలు కలిగిస్తుంది. ఐతే రొటీన్ ఫ్లోతో సాగిపోతున్న కథలో పాత్రల పరంగా ట్విస్టులు బయటికి వచ్చాక 'మెకానిక్ రాకీ' ఎంగేజ్ చేయడం మొదలుపెడుతుంది. మరీ షాకైపోయే రేంజి ట్విస్టులు కాకపోయినా.. ప్రేక్ష కుల అటెన్షన్ రాబట్టడానికి అవి సరిపోయా యి. కథ పరంగా విశ్వక్సేన్ 'ధమ్కీ'ని గుర్తుకు తెచ్చినా.. ఇందులో ఎమోషన్ తో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ముందు మామూలుగా అని పించిన పాత్రలు ట్విస్టు తర్వాత క్రేజీగా మారుతాయి. ఆ పాత్రలే సినిమాను డ్రైవ్ చేస్తాయి. సైబర్ నేరాల నేపథ్యంలో ప్రేక్ష కులు కనెక్ట్ అయ్యేలా కథాకథనాలు నడవ డంతో ద్వితీయార్ధమంతా మంచి ఫ్లోతో నడు స్తుంది. క్లైమాక్స్ ఇంకొంచెం భిన్నంగా.. క్రేజీగా తీర్చిదిద్దుకుని ఉంటే ప్రథమార్ధం లోని తప్పులన్నీ మాఫీ అయిపోయేవి. కానీ ముగింపు సన్నివేశాలు ఒకింత నిరాశ పరు స్తాయి. 'మెకానిక్ రాకీ'ని సూపర్ అనలేం. అలా అని తీసిపడేయనూ లేం. హీరోతో పాటు ఇద్దరు హీరోయిన్ల పాత్రలకూ ప్రాధాన్యం ఉండ డం.. వాళ్ల అందం అభినయంతో ఆకట్టు కోవడం ఈ సినిమా ప్రత్యేకత. ఈ ముగ్గురి కోసం.. కథలోని ట్విస్టులు.. సెకండాఫ్ లో ఎంగేజింగ్ గా సాగే కథనం కోసం 'మెకా నిక్ రాకీ'పై ఓ లుక్కేయొచ్చు. కానీ ఎక్కువ అంచనాలు పెట్టుకుంటే మాత్రం కష్టం.

**సాంకేతిక వర్గం:** టెక్నికల్‌గా 'మెకానిక్ రాకీ' ఓకే అనిపిస్తుంది. జేక్స్ బిజోయ్ పాటలు బాగానే సాగాయి. మంగ్లీ పాడిన పాట వినసొంపుగా ఉంది. దాని చిత్రీకరణ కూడా బాగుంది. మిగతా పాటలు ఓ మోస్తరుగా అనిపిస్తాయి. జేక్స్ బ్యాగ్రౌండ్ స్కోర్ సినిమా నడతకు తగ్గట్లుగా సాగింది. సినిమాటోగ్రాఫర్ మనోజ్ రెడ్డి తన విజువల్స్ తో మెప్పించాడు. నిర్మాణ విలువలు సినిమాకు సరిపడా ఉన్నాయి. రైటర్ కమ్ డైరెక్టర్ రవితేజ ముళ్ళపూడి పనితనం 50-50గా అనిపిస్తుంది. అతను తన కథలో భారమంతా ట్విస్టుల మీదే పెట్టేశాడు. వాటి మీద ద్వితీయార్ధంలో కథనాన్ని నడిపించిన తీరు బాగానే ఉంది కానీ.. ప్రథమార్థాన్ని మరీ అంత రొటీన్ టెంప్లేట్లో నడిపించడమే నిరాశ పరుస్తుంది. నరేషన్లో ఒక కొత్త దర్శకుడి నుంచి ఆశించే వైవిధ్యాన్ని అతను చూపించలేకపోయాడు. ఐతే ప్రథమార్ధంలో జరిగిన తప్పులను రెండో అర్ధంలో ఓ మోస్తరుగా అతను కవర్ చేశాడు.

**- తుపాకి.కామ్ సౌజన్యంతో...**

## మహారాష్ట్ర పట్టం..మహా'యుక్తి'కే..!

ఇంటర్నెట్‌డెస్క్‌: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా నేతృత్వంలోని మహాయుతి సర్కారు పట్టు నిలుపుకొంది. 2019 నుంచి ముగ్గురు ముఖ్యమంత్రులు, నలుగురు డిప్యూటీ సీఎంలను చూసిన ఈ రాష్ట్ర ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. ఓబీసీ ఓట్ల సమీకరణ, ఆకర్షణీయమైన పథకాలు, మహిళల ఓట్లు విజయంలో కీలక భూమికను పోషించాయి. భాజపా, శివసేన శిందే, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ.. ఇలా మూడు పార్టీలు మెరుగైన ప్రదర్శన చేయడం కూటమి విజయానికి దోహదం చేశాయి.

**ఓబీసీల భయాలు..**

ఈ ఎన్నికలను అత్యధికంగా ప్రభావితం చేసిన అంశం ఓబీసీ సమీకరణ. కీలకమైన మరాఠా ఓటర్లు మహావికాస్ అఘాడీలోని కాంగ్రెస్ వైపు కొంత మొగ్గు చూపుతున్నట్లు గ్రహించిన కమల బృందం తన వ్యూహానికి పదును పెట్టింది. మరాఠా వంటి బలమైన వర్గం కాకుండా ఉన్న ఇతరత్రా వర్గాలన్నింటినీ భాజపా ఏకీకృతం చేసింది. ముఖ్యంగా ఓబీసీ ఓట్ల పైనే ప్రధానంగా దృష్టి పెట్టింది. భాజపా ఈ రాష్ట్రంలో 90ల నుంచే వీరిని తమ వైపు ఆకర్షించడానికి యత్నాలు మొదలుపెట్టింది. ముఖ్యంగా మాలి, ధంగర్, వంజరి వర్గాలు కమలనాథులకు అండగా ఉన్నాయి. మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్లు ప్రకటిస్తే తమ వాటా తగ్గుతుందని చాలా జాతుల్లో భయాలున్నాయి. వాటిని కమలం పార్టీ ఓట్లుగా మలుచుకుంది. మరోవైపు మహావికాస్ అఘాడీ మాత్రం పూర్తిగా మరాఠా రిజర్వేషన్ల అంశంపైనే ఆధారపడింది. అధికారంలోకి వస్తే వారికి రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. చిత్రం ఏంటంటే, మరాఠా వర్గానికి ఏక్‌నాథ్ శిందే అక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 'మహాయుతి' ముఖ్య నేతగా పేరొందారు. దాంతో మహావికాస్ అఘాడీ ఆశించిన స్థాయిలో పెద్ద ఎత్తున మరాఠా ఓట్లు వాళ్లకి పడలేదు.

**భాజపా-కాంగ్రెస్ ముఖాముఖి పోరు..**

ఈసారి ప్రధాన పార్టీలైన భాజపా- కాంగ్రెస్ 76 సీట్లలో ముఖాముఖి తలపడ్డాయి. గత కొన్నేళ్లుగా పలుచోట్ల జరిగిన ఇలాంటి పోరులో హస్తం పార్టీ పక్షాన సానుకూల ఫలితాలు వచ్చిన సందర్భాలు అతి తక్కువ. ఈసారి ఫలితాలను జాగ్రత్తగా గమనిస్తే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 44 సీట్లను గెలుచుకోగా.. ఈసారి ఆ సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఆ మేరకు భాజపాకు సీట్ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది.

**మహిళల ఓట్లు కమలం పక్షాన..**

రాష్ట్రంలోని మహిళా ఓట్లను 'లడ్కీ బెహన్ పథకం' కూడగట్టింది. రూ.1,500 నేరుగా వారి ఖాతాల్లో వేయడంతో లబ్ధిదారులు 'మహాయుతి' వైపు నిలిచారు. ఈసారి ఆ మొత్తాన్ని రూ.2,100 చేస్తామని కూటమి హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పోటీగా రూ.3,000 ఇస్తామని పేర్కొంది. అయినా ఓటర్లు భాజపా కూటమికే పట్టం కట్టారు. ఈ పథకం వల్ల అత్యధిక ప్రయోజనం పొందిన పుణె, థానే, నాసిక్, నాగ్‌పుర్, షోలాపుర్ జిల్లాల్లో మహిళల ఓటింగ్ పోటెత్తడం భాజపాకు బాగా కలిసొచ్చింది.

**ఓట్ల బదలాయింపు సజావుగా..**

మహాయుతిలో ఓట్ల బదలాయింపు సజావుగా సాగినట్లు ఫలితాలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు మహావికాస్ అఘాడీలో సీట్ల సర్దుబాటు వేళ తలెత్తిన విభేదాలు ఎన్నికలపై ప్రతికూల ప్రభావం చూపాయి.

# సభ్యులు తెలిపిన సమస్యలు పునరావృతం కాకూడదు

**- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ**



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సభ్యులు తెలిపిన సమస్యలు పునరావృతం కాకూడదని జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ సాయిరాజ్ తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఐటీడీఏ పీఓ యశ్వంత్ కుమార్‌లతో కలిసి శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యులు పరిధిలో ఉన్న ప్రజలకు ఉపయోగపడే సమస్యలు పై చర్చించాలని కోరారు. భూగర్భ గనుల శాఖ డిడి మోహనరావు జిల్లా నుండి సుమారు రూ.1350కోట్లు ప్రభుత్వానికి రెవెన్యూ అందిస్తున్నట్లు వివరించారు. 9.13లక్షల టన్నులు ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇంతవరకు ఎన్ని కేసులు పెట్టారని వైస్ చైర్మన్ సిరిపురం జగన్మోహన్‌రావు ప్రశ్నించగా 106 కేసులు పెట్టినట్లు మైన్స్ డీడీ వివరణ ఇచ్చారు. రీచ్‌లలో సీసీ కెమేరాలు లేవని సభ్యులు లేవనెత్తగా సోలార్‌తో ఏర్పాటు చేయడం వలన అవి సరిగా పనిచేయడం లేదని డీడీ చెప్పారు. సీసీ కెమేరాలు ఏ ఏ రీచ్‌లలో లేవో ఆ వివరాలు కలెక్టర్‌కు తెలియజేయాలని చైర్మన్ సూచించారు. పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ డోల, పల్లెపేట గ్రామాల నుండి ఇసుక గ్రామాల నుండి లారీల్లో తరలిస్తున్నారని, ఒరిస్సా బిల్లులుతో ఇసుక తరలిస్తున్నారని, దీనిపై దృష్టి సారించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని కోరారు. ఈ విషయాన్ని పరిశీస్తామని డీడీ తెలిపారు. సభ్యులు తెలిపిన వివరాలను నోట్ చేసుకొని సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని చైర్మన్ డీడీకి చెప్పారు.

డీఎంహెచ్ఓ డాక్టర్ బి.మీనాక్షి మాట్లాడుతూ ఆరోగ్యశాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలను వివరించగా వైస్‌చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ గ్రామాల్లో ఆర్ఎంపీ వైద్యులపైనే ఆధారపడుతున్నారని, శాఖాపరమైన సిబ్బంది అన్ని సమయాల్లో అందుబాటులో ఉండాలని చెప్పగా గ్రామస్థాయి నుండే వైద్యసిబ్బంది స్థానికంగా ఉంటున్నారని, వారి సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ తెలిపారు. వైద్యశాఖపై ప్రజల్లో నమ్మకం కలగాలని సభ్యులు చెప్పగా, సర్వీసు పెంచి నమ్మకం పెంచే విధంగా చర్యలు చేపడతామని డీఎంహెచ్ఓ వివరించారు. ఉద్దానంలో కిడ్నీ పేషెంట్లకు సంబంధించి మృతుల రేటు పెరుగుతుందని, దయాలసిస్ యూనిట్లు పెంచాలని చైర్మన్ చెప్పారు. డీసీహెచ్ఓ మాట్లాడుతూ దయాలసిస్ యూనిట్లు ఉన్నాయని, సరిపోయే పడకలు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు. మెడిసిన్ కూడా అక్కడే ఇస్తున్నారన్నారు. మెడిసిన్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సభ్యులు సీతారాం చెప్పారు. చర్యలు తీసుకుంటామని రిమ్స్ సూపరింటెండెంట్ షకీలా మందులపై చేపడుతున్న చర్యలను గూర్చి వివరించారు. రాజాం జడ్పీటీసీ సభ్యులు నర్సింహులు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ఆరోగ్య సిబ్బందిపై తెలియజేస్తూ సిబ్బంది సర్వీసు అందించాలని చెప్పగా సిబ్బంది అంతా స్థానికంగా నివాసం ఉంటున్నారని డిఎంహెచ్ఓ చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా ఉండాలని చైర్మన్ తెలిపారు. పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ సభ్యులు పరిధిలో ఉన్న సమస్యలను తెలియజేయాలి తప్ప వ్యక్తిగత దూషణలు, పార్టీలపై మాట్లాడకూడదని చెప్పారు. ఈ విషయాన్ని సభ్యులంతా గమనించాలని కోరారు. హిరమండలం జడ్పీటీసీ సభ్యులు బుజ్జిబాబు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఒక వ్యక్తి మహాత్మాగాంధీ ఆసుపత్రికి వెళుతున్నారని, కేన్సర్ పేషెంట్లకు పెన్షన్ వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పంచాయతీ రాజ్ శాఖ జిల్లా చేపడుతున్న అభివృద్ధి పనుల గూర్చి వివరించారు. అభివృద్ధి పనులు ఆపకుండా కొనసాగించి గ్రామాలను అభివృద్ధి చేయాలని రణస్థలం సభ్యులు కోరారు. వంగర మండలం ఎంపిపి ఉత్తరావల్లి సురేష్‌ముఖర్జీ మాట్లాడుతూ రూ.39కోట్లుతో 29పంచాయతీలకు అభివృద్ధి పనులకు మండలం నుండి తీర్మానం చేయగా కొన్ని పంచాయతీలకు మాత్రమే పనులు మంజూరు చేశారని, అన్ని గ్రామాలు అభివృద్ధి చెందాలని, మిగిలిన గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకంపై పీడీ సుధాకర్ పనులు కావలసిన వారికి పనులు మంజూరు చేస్తామన్నారు. జి.సిగడాం జడ్పీటీసీ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు ప్రతీ గ్రామానికి ఒక్కో చెరువులకు నిధులు మంజూరు చేశారని, ఆ చెరువుల్లో పూడికతీత పనులను మంజూరు చేయాలని కోరారు. పూడిక తీతకు నిధులు మంజూరు చేస్తామని మీ మండలంలోని ఉపాధి హామీ అధికారులకు తెలియజేయాలని పీడీ చెప్పారు. ఉపాధి హామీ నిధులు ఏయే పనులకు ఇస్తున్నారో తెలియజేయాలని చైర్మన్ తెలిపారు. ఎత్తు పల్లాల భూములు చదును చేసుకోవడానికి పనులకు దరఖాస్తు చేసుకోవచ్చని పీడీ చెప్పారు. పశువులు ఉన్న గ్రామాల్లో గోకులాలు మంజూరు చేయాలని రణస్థలం మండలం జడ్పీటీసీ కోరారు. వంగర మండలంలో గోకులాలు మంజూరు కాలేదని ఎంపీపీ ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ తెలపగా ఏపీడీ మాట్లాడుతూ ప్రతీ మండలానికి 75 గోకులాలు మంజూరుకు ప్రతిపాదనలు వచ్చాయని, వంగర మండలం నుండి ప్రతిపాదనలు రాలేదని చెప్పారు.

పాలకొండ మండలం జడ్పీటీసీ సభ్యులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కాలువలు, సిసి రోడ్లు మంజూరు కాలేదని చెప్పి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పగా, నియోజకవర్గానికి 14 కోట్ల రూపాయలు మంజూరయ్యా యని పార్వతీపురం మన్యం ఉపాధి హామీ పీడీ వివరించారు. గ్రామీణ రక్షిత మంచినీటి పథకం ఒక్కో మండలంలో ఏయే పనులు మంజూరు అవుతాయో ఆ వివరాలను సభ్యులకు పంపేందుకు చర్యలు చేపడతామని జెడ్పీ చైర్‌పర్సన్ విజయ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. ఎస్‌ఈ ఎహసాన్ భాషా మాట్లాడుతూ జిల్లాలో గ్రామీణ రక్షిత మంచినీటి పథకంపై వివరించారు.

హిరమండలం సభ్యులు బుజ్జిబాబు మాట్లాడుతూ మండలంలో కిడ్నీ బాధితులు పెరుగుతున్నారని, మండల ప్రజలకు వంశధార నుండి తాగునీరు సరఫరా చేయాలని కోరారు. అందుకు ప్రతిపాదనలు పంపుతామని ఎస్‌ఈ తెలిపారు. పౌరసరఫరాల శాఖపై జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ధాన్యం సేకరణపై వివరించారు. బూర్జ సభ్యులు మాట్లాడుతూ ధాన్యం రేటు చెప్పలేదని, ఏ రైతు ధాన్యాన్ని ఎక్కడకు తీసుకువెల్లాలో చెప్పలేదని చెప్పారు. ఏ రైతు ఏయే మిల్లులకు తీసుకువెళ్లాలో తెలియజేస్తామని డీఎం చెప్పారు. రవాణా చార్జీలు, బస్తాల డబ్బులు ఎవరికి ఇస్తారని సభ్యులు అడుగగా రైతులకు ఇస్తామని డీఎం వివరించారు. శాసనమండలి సభ్యులు పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ పాలసీని ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. రైతులకు అవగాహనపరచిన నాడే ప్రతీ రైతు లాభపడతారని సూచించారు. గ్రామీణాభివృద్ధిశాఖపై పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు పెట్టిన సిఫార్సులకు పెన్షన్లు ఆపవద్దని జిల్లా పరిషత్ అధ్యక్షులు తెలియజేసి, విచారణ చేసి ఆపాలని చెప్పగా పెన్షన్లు మంజూరు, తొలగింపులు సంబంధించి ఎంపిడిఓలకు అధికారం ఉం టుందని పీడీ చెప్పారు.

అధికారులంతా ప్రోటోకాల్ పాటించి సమావేశాలకు అందరిని పిలవాలని అడుగగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రోటోకాల్ జిఓ ప్రకారం ప్రజా ప్రతినిధుల అందరిని పిలవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జడ్పీ సీఈవో ఎల్ఎన్ వి శ్రీధర్‌రాజ మాట్లాడుతూ అజెండాఐటమ్స్‌ను శాఖల వారీగా చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టు నిర్మాణం వద్దు

(సత్యంన్యూస్, పలాస)

ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని చేపట్టడం సరికాదని జిల్లాలోని పలు ప్రజా సంఘాలు విమర్శించాయి. ఈమేరకు శనివారం పత్రికా ప్రకటన విడుదల చేశాయి. జిల్లాలోని పలాస నియోజకవర్గ పరిధిలోని మందస,వజ్రపుకొత్తూరు మండలాల సముద్ర తీర ప్రాంతాలలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను నిలుపుదల చేయాలని ఏఐకెయంయస్ జిల్లా నాయకులు తాండ్ర ప్రకాష్, గొరకల బాలకృష్ణ, రాపాక మాధవరావు, అరుణోదయ నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, మార్పు మల్లేశ్వరరావు, పీవోడబ్ల్యు జిల్లా నాయకులు సవలాపురపు కృష్ణవేణి, పోతనపల్లి కుసుమ, కుత్తుం హేమక్క, పీవైయల్ జిల్లా నాయకులు సార జగన్, ఇఫ్టూ నాయకులు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరావు డిమాండ్ చేశారు. ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులు గురువారం మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సముద్ర తీరంలోని గ్రామాలను పరిశీలించి, ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఎంపిక చేసి సుమారు1400 ఎకరాల ప్రజల జీవనాధార భూముల్ని ప్రజల నుంచి కొనుగోలు చేసేయత్నాలకు పూనుకుంటున్నారన్నారు. ప్రజల ఆమోదం లేకుండా ఈ విధానం సరైంది కాదన్నారు. ఉద్దానంలోని రైతులు, ప్రజలు తమ జీవనాధారాన్ని ధ్వంసం చేసే ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారన్నారు. ప్రజల భూములకు నష్టపరిహారాన్ని లెక్కించడానికి బదులు ప్రజల జీవనాధారాన్ని ధ్వంసం చేస్తున్నామనే స్పృహతో ప్రభుత్వం వ్యవహరించాలని వారు కోరారు. ప్రజల ఆమోదంలేని ఇటువంటి నిర్మాణాలను ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటుకు మానుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రానున్న లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జూనైద్ అహ్మద్ మౌలానా అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కోర్టు భవనంలో జిల్లాలో గల న్యాయమూర్తులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. వచ్చేనెల 14న జరగనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు.



వచ్చేనెల 28న స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ప్రముఖ గాయకులు నాగూర్‌బాబు (మనో) సంగీత విభావరి కార్యక్రమానికి తగిన సహాయ సహకారాలు అందించాలని కోరుతూ శ్రీసుమిత్ర కళాసమితి ప్రతినిధులు శనివారం ఎస్పీ మహేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు ఇప్పిలి శంకర్‌శర్మ, ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావు, ఉపాధ్యక్షులు మండవల్లి రవి, సభ్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.

## ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)

పుటపర్తి సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు శనివారం సరుబుజ్జిలి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సత్యసాయి భక్తులు గుడ్ల తిరుమలరావు ఆధ్వర్యంలో సత్యసాయికి విశేష పూజలు, భజనలు, అఖండ నామసంకీర్తన నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన చేపట్టారు.



## రహదారి గుంతలు.. ప్రయాణీకుల తిప్పలు

(సత్యంన్యూస్, సరుబుజ్జిలి)

జిల్లా కేంద్రం నుంచి జిల్లా శివారు ప్రాంతమైన బత్తిలికి వెళ్లే అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో ఎక్కడికక్కడ పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో తరుచూ ప్రయాణీకులు ఇక్కట్ల పాలవుతున్నారు. ఇటీవల ఆర్&బి అధికారులు గుంతల మరమ్మతుల పేరిట తాత్కాలికంగా స్టోన్ మెటల్ వేసి చేతులు దులుపుకోవడంతో తరుచూ వాహనాల టైర్లు ఫంక్చర్లు అవుతున్నాయి. ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా శనివారం బత్తిలి నుండి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ బస్సు సరుబుజ్జిలి సమీపంలో టైరు ఫంక్చర్ కావడంతో ప్రయాణీకులు మండుటెండలో ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా ఆర్&బి అధికారులు స్పందించి తారు మిక్సింగ్ లేయర్‌తో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.





జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హౌస్ టు హౌస్ సర్వేలో జియో ట్యాగింగ్ కొరకు ఇంటి ఫోటోలు తప్పనిసరి అని ఎంపీడీవో నీరజ గారు సూచించారు. శనివారం లబ్బ గ్రామంలో సందర్శించి గిరిజన గ్రామం కావడంతో నెట్‌వర్క్ సక్రమంగా లేక ఆఫ్లైన్లో జియో టాకింగ్ చేయాలని ఆదేశించారు. – సత్యంన్యూస్, శ్రీకాకుళం.



సినీనటుడు నాగచైతన్య జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం ఆయన అభిమానులు విజయశ్రీ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు గురుచరణ్, వైస్ ప్రెసిడెంట్ పొట్నూరు సంతోష్, శరత్, అశోక్, హరి, యస్వంత్‌లు పాల్గొన్నారు.– సత్యంన్యూస్, శ్రీకాకుళం



కొత్తూరు ఎస్సైగా ఎండీ అమీర్ ఆలీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకు ముందు జిల్లాలోగల పాతపట్నం, నందిగాం స్టేషన్‌లో పని చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం.


ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫేక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

## పీయూసీలో ఎన్ఈఆర్‌కు స్థానం

(సత్యంన్యూస్, రణస్థలం)



ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పీయూసీ)లో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుకు (ఎన్ఈఆర్)కు స్థానం కల్పించారు. ఏపీలో ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ), అంచనాల కమిటీ(పీఈసీ), ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ(పీయూసీ)లకు సంబంధించిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. కమిటీలకు ఎన్నికైన సభ్యుల వివరాలను ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలో సభ్యులుగా ఆనందరావు, నడుకుదిటి ఈశ్వరరావు, గిడ్డి సత్యనారాయణ, గౌతు శిరీష, కూన రవికుమార్, కుమార్ రాజా, బేబీ నాయనా, తెనాలి శ్రావణ్, వసంత కృష్ణప్రసాద్ ఎన్నికైనట్లు స్పీకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ
## సభ్యురాలిగా శిరీష

(సత్యంన్యూస్, పలాస)



పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ సభ్యురాలిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషకు ప్రభుత్వం స్థానం కల్పించింది. ఈ మేరకు అసెంబ్లీలో శుక్రవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు కమిటీ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి, స్పీకర్‌లకు ధన్యవాదాలు తెలిపారు ప్రభుత్వం అందించిన అదనపు విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని చెప్పారు. ప్రభుత్వానికి వనరులు అందించేందుకు తనవంతుగా సహాయకారిగా ఉంటానని స్పష్టం చేశారు.

## మెకానిక్‌కు ఆర్థిక సాయం

(సత్యంన్యూస్, పలాస)



ఇటీవల ప్రమాదానికి గురైన మెకానిక్ కింతాడ నిరంజన్‌కు సిద్ధి విఘ్నేశ్వర మెకానిక్ సంక్షేమ సంఘం పరామర్శించింది. ఈ సందర్భంగా నిరంజన్‌కు రూ.16 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, అధ్యక్షులు బెవర చిన్నబాబు, వెరిచర్ల శంకర్, బోయన రాజు, పన్నీరు భాను, సైన రంగా, హేమ కుమార్, డొక్కర రాజారావు, పులారి దుర్యోధన, మల్లా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## 25న తిరుమల రూ.300 దర్శన టికెట్లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఫిబ్రవరి నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు ఈ నెల 25న విడుదల కానున్నాయి. ఉదయం 10 గంటల నుంచి ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలోని వసతి గదుల టోకెన్లు రిలీజ్ చేస్తారు.

## ధర్నాలను జయప్రదం చేయండి

(సత్యంన్యూస్, మందస)

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్, పలాస ఆర్డీవో కార్యాలయాల వద్ద జరుగు ధర్నాలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు పిలుపునిచ్చారు. శనివారం మందస సిటు కార్యాలయంలో సిటు, రైతుసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతరేక విధానాలను అమలుచేస్తున్నాయని విమర్శించారు. సర్వ సంపదలు సృష్టించేది కార్మికవర్గమని, ప్రజలకు తిండిపెట్టేది రైతాంగమని, కాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి వ్యతిరేకంగా కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు అనుకూలంగా గత పదేళ్లలో లక్షల కోట్లు రుణమాఫీ, పన్నురాయితీ, ప్రోత్సాహాల పేరుతో ప్రజల ధనాన్ని దోచిపెట్టిందని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కార్పొరేట్ పన్ను 32 శాతం పెంచాలని, అత్యంత ధనికుల సంపద, వారసత్వ పన్నుల పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేసారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అప్పలస్వామి, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టు వద్దు.. మా భూములే మాకు ముద్దు



(సత్యంన్యూస్, పలాస)

ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దని, తమ స్థిరాస్తి భూములే ముద్దు అని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డ్ మెంటెర్ బత్తిని లక్ష్మణ్ పేర్కొన్నారు. ఈమేరకు కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలాస నియోజకవర్గ ప్రప్రథమ మహిళా శాసన సభ్యులు గౌతు శిరీషలకు లేఖ రాశారు. మందస ఉద్దానం రైతులకు జీవనాధారమైన కొబ్బరి, జీడీ ప్రధానమైన పంటలు ఆరేళ్ల క్రితం వచ్చిన తిత్లీ తుపానుతో సర్వనాశనమైపోగా, ఏదోలా బతుకు ఈడుస్తున్న సమయంలో 1394 ఎకరాల్లో కార్గో ఎయిర్‌పోర్టు వస్తుందంటూ శ్రీకాకుళం జిల్లా ఉన్నతాధికారులు తెచ్చిన పిడుగులాంటి వార్తతో భేతాళపురం, రాంపురం, చీపురుపల్లి పంచాయతిలోని ఐదు రెవిన్యూ గ్రామాల ప్రజలుగా ఆందోళనకు గురవుతున్న విషయం తెలిపారు. ఈ ఎయిర్‌పోర్టు ఉద్దానం ప్రజల అభివృద్ధి కోసం కాదని, తీర ప్రాంత భూముల్లో ఉన్న ఖనిజ సంపద తరలించుకుపోవటానికి మాత్రమే అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆ లేఖలో పేర్కొన్నారు. నిజంగా ఈ ప్రాంతం అభివృద్ధి కావాలంటే కొబ్బరి, జీడీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, సాగునీరు, తాగునీరు, పండిన పంటలకు కనీస మద్దతు ధర సమకూర్చాలని కోరారు. కార్గో ఎయిర్‌పోర్టు వద్దు మా భూములే మాకు ముద్దు అంటూ ఈ ప్రాంత ప్రజల తరఫున ప్రభుత్వాన్ని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఇక్కడికి దగ్గరలో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు భోగాపురంలో కడుతున్నారని, ఇంకా ఇక్కడ విమానాశ్రయానికి 1394 ఎకరాల భూమి అవసరమా అని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు భూములను కట్టబెట్టడమే తప్పా తమకు ఒరిగేది ఏమి లేదన్నారు. కనీసం ఈ మూడు పంచాయతీల్లోని ఐదు రెవిన్యూ గ్రామప్రజలకు, రైతులకు సంప్రదించకుండా నేరుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వచ్చి తమ భూముల్లో కొలతలు వేస్తూ జెండాలు పాతుతుంటే తాము ఏమనుకోవాలని ప్రశ్నించారు. కేంద్రమంత్రి రాము, స్థానిక ఎమ్మెల్యే శిరీష ఒకటికి రెండుసార్లు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే పార్టీలకు అతీతంగా తమ మూడు పంచాయతీ ప్రజలు ఏకమై ప్రజా సంఘాలతో కలిసి పోరాటం చెయ్యక తప్పదని ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు.

### పినకాన ఆశయాలు
## కొనసాగిద్దాం



(సత్యంన్యూస్, నందిగాం)

ప్రజాపక్షపాతి, పీడిత ప్రజల ఆశాకిరణం సీపీఎం నాయకులు పినకాన కృష్ణమూర్తి ఆశయాలను మనమంతా కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కోణారి మోహనరావు అన్నారు. లక్ష్మీపురం వద్ద కృష్ణమూర్తి స్వగ్రామంలో 8వ వర్ధంతి సభను నంబూరు షణ్ముఖరావు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా నరసింగపల్లి వద్ద గల స్థూపాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. రైతాంగ పోరాటం ద్వారా రైతులకు సమస్యలపై పోరాడేందుకు సన్నద్ధం చేసిన మహోన్నత వ్యక్తి కృష్ణమూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాలిని సాంబమూర్తి, పినకాన అజయ్‌కుమార్, కింతల ధర్మారావు, హెచ్.ఈశ్వరరావు, ఎం.ఆదినారాయణ, పి.లత్సయ్య, స్టాలిన్, జోగారావు, వసంతరావు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### సత్యసాయి జయంతి వేడుకల్లో
## ఎమ్మెల్యే దంపతులు

(సత్యంన్యూస్, నరసన్నపేట)

సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు కిల్లాం, వెదుళ్లవలస, పోలాకి, డోల గ్రామాల్లోని సత్య సాయి మందిరాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి – సుగుణమ్మ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం పలువురు నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ డోల జగన్, నరసన్నపేట, పోలాకి మండల పార్టీ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భైరి భాస్కరరావు, సర్పంచులు లుకలాపు రాంబాబు, ఆర్.బి.రామన్న, డోల ఉదయ్‌భాస్కర్, పొట్నూరు సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, సత్యసాయిబాబా భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



### మహిళల పట్ల నోటికొచ్చినట్లు మాట్లాడితే
## ఊరుకునేది లేదు

**- సవిత మాటలను ఖండించిన రెడ్డి శాంతి -**

(సత్యంన్యూస్, పాతపట్నం)



ప్రజాసంక్షేమానికి జగన్ బటన్లు నొక్కితే ఆయా సొమ్ముతో మహిళలు గంజాయికి బానిసలయ్యారని వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రశ్నించారు. అసెంబ్లీలో కూటమి మంత్రి సవిత మాటలను ఆమె ఖండించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోరి అన్ని వర్గాల ప్రజలకు ఎటువంటి తారతమ్యాలు చూడకుండా బటన్ నొక్కి ప్రజలకు ఆర్థిక సహాయం అందించి, వారే ఆర్థిక పురోభివృద్ధికి సహకారం అందిస్తూనే.. వారి ఇళ్లల్లో వెలుగులు నింపిన గొప్ప ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ఆమె అన్నారు. మహిళలు ఎవరి వద్ద తల దించకుండా, చేయి చాపకుండా ఆర్థిక భరోసా కల్పించి డైరెక్ట్‌గా బటన్ నొక్కి మహిళా అభ్యున్నతే ధ్యేయంగా జగనన్న పాలన జరిగిందన్నారు. ప్రభుత్వ బ్యాంకుల ద్వారా చేయూత, అభివృద్ధి, భరోసా ఇస్తూ పొదుపు సంఘాలను, మహిళలకు జగన్ ప్రభుత్వంలో అగ్రస్థానంలో నిలిపారన్నారు. ఇవన్నీ నిర్వీర్యం చేసింది కాక తిరిగి మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడడం సిగ్గుచేటని రెడ్డి శాంతి విమర్శించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే శక్తి లేని కూటమి ప్రభుత్వం తప్పించుకోవడానికి పనికిమాలిన మాటలాడితే మహిళలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఇటువంటి వ్యాఖ్యలు చేసినందుకు మంత్రి సవిత మహిళలందరికీ క్షమాపణలు చెప్పాలని ఆమె అన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎన్‌సిఈఆర్‌టి, విజ్ఞాన్ ప్రసార్, ఎన్‌సిఎస్ఎంలు సంయుక్తంగా గత నెలలో దేశవ్యాప్తంగా పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వివిఎమ్) ప్రతిభా పరీక్షలో జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పరీక్షల జిల్లా సమన్వయకర్త ఏ.పున్నయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఎవిఎన్ఎంసిహెచ్ స్కూల్‌కు చెందిన వి.హరిణి(9వ తరగతి), ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌కు చెందిన బలివాడ నవీన (6వ తరగతి), సి.ఎల్.ఎన్.వైష్ణవి (6వ తరగతి), జామి వేదశ్రీ (7వ తరగతి)లు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆయన వెల్లడించారు. వందల సంఖ్యలో హాజరైన విద్యార్థుల నుంచి నలుగురు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు. ఈ నలుగురు విద్యార్థులు వచ్చే నెల 15న రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి శిబిరానికి హాజరవుతారని ఆయన తెలిపారు. విద్యార్థులను డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి విజయకుమారి కౌషల్, కో–ఆర్డినేటర్లు మధుబాబు, ఉమేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

## 24న పట్టుశాలి వనసమారాధన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తోటపాలెం–పొన్నాడ రోడ్డులోని వెంకన్నగారిపేట తోటలో ఈ నెల 24న పట్టుశాలి కులస్తుల వనసమారాధన నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు గుంటుకు చంద్రశేఖర్, కార్యదర్శి పేకల రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుశాలి కులస్తులంతా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.



దోమలు బెడద నివారణకు బలగ సమీపంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తరగతి గదుల కిటికీలకు, ఐరన్ మెస్‌లను ఏర్పాటుచేసినట్లు ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాస్ తెలిపారు. చదువు, విద్యార్థులు నివాసం ఉంటున్న గదులకు పాఠశాల మిగులు నిధులతో వీటిని ఏర్పాటుచేయడంపై సంతోషం వ్యక్తం చేశారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం**

## కిడ్నీ బాధిత వృద్ధునికి రక్తదానం



(సత్యంన్యూస్, టెక్కలి)

సంతబొమ్మాళి మండలం కోటపాడు గ్రామానికి చెందిన లింగూడు సింహాచలం అనే వృద్ధుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ టెక్కలి జిల్లా ఆసుపత్రి వెళ్లగా పరీక్షించిన వైద్యులు అత్యవసరంగా ఎ–పాజిటివ్ బ్లడ్ ఎక్కించాలని తెలిపారు. బంధువులు ఎవరూ రక్తదానం చేయడానికి అందుబాటులో లేకపోవడంతో సింహాచలం కుటుంబ సభ్యులు టెక్కలి అభయం యువజన సేవా సంఘాన్ని కలిశారు. వెంటనే స్పందించిన అభయం సేవా సంఘం జిల్లా హాస్పిటల్ బ్లడ్‌బ్యాంక్ వారితో మాట్లాడి ఎ–పాజిటివ్ బ్లడ్ అందించారు. ఈ కార్యక్రమంలో అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు, బ్లడ్ బ్యాంక్ ఉద్యోగి శ్రీధర్ పాల్గొన్నారు.

## సత్యసాయి ఆలయాన్ని దర్శించుకున్న కలిశెట్టి



(సత్యంన్యూస్, రణస్థలం)

రణస్థలంలోని సత్యసాయిబాబా మందిరాన్ని విజయనగరం ఎంపీ, ఐటీ అండ్ కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. బాబా జన్మదినం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో కలిశెట్టితో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 'అపార్' కష్టాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒన్ నేషన్ – ఒన్ స్టూడెంట్ నినాదంతో దేశ వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్టేషన్(అపార్) పేరిట జారీ చేస్తున్న కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల సమన్వయ లోపం, ఆలస్యం తదితర కారణాలతో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి జిల్లాకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. ఈమేరకు శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఇప్పటికే ఉన్న ఆధార్ కార్డుల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లు తప్పులు, స్కూల్ రికార్డులలో జన్మదిన తేదీల మార్పులు, చిన్నపాటి అక్షర దోషాలు, గ్రామ, నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు, నగరపాలక, మహా నగరపాలక సంస్థల్లో నమోదై ఉన్న జనన ధ్రువీకరణ పత్రాలలో విద్యార్థుల ఇంటి పేర్లు, పూర్తి పేర్లు నమోదు కాకపోవడం, చిన్న, చిన్న అక్షర తప్పులు తదితర సమస్యలు సరిచేసేందుకు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు ఆయా జిల్లాల్లో ఆధార్ కేంద్రాలు అందుబాటులోకి లేకపోవడం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రుల తీవ్ర అవస్థలు పడుతున్నట్టు తమకు నిత్యం ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులు, ఇంటర్మీడియట్ ఆర్ఐవోలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ, రెవెన్యూ అధికారులు, ఆధార్ సంబంధిత అధికారులకు తమ కమిషన్ చైర్‌పర్సన్ కేసలి అప్పారావు సారధ్యంలో వివిధ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వేగవంతమైన చర్యలు చేపట్టాలని సీతారాం సూచించారు.



శ్రీకాకుళం రూరల్ మండలం బట్టేరు గ్రామంలో తుప్పలు పెరిగిపోయి రాళ్లు రప్పలతో నిండివుండటంతో పొలం పనులకు వెళ్లే రైతులు, స్థానికులు ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సామాజిక సేవలో భాగంగా టీడీపీ యువ నాయకుడు కర్రి చంద్రశేఖర్ తన సొంత నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేశారు. దీనిపై స్థానికులు, రైతులు హర్షం తెలిపారు.

**- సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్**

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.